క్లుప్తంగా

ముగిసిన కల్యాణ మహోత్సవ వేడుకలు

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో గత నాలుగు రోజులుగా జరుగున్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిసింది. ఆలయ అర్చకులు సుగంధ రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించగా.. భక్తులు పాల్గొన్ని పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు.

అయ్యప్ప ఆలయంలో ప్రతిష్ఠా పూజలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 10వ డివిజన్ చైతన్యనగర్‌లోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు మంగళవారం మొదలయ్యాయి. కేరళకు చెందిన తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రి, పాకతిల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యాన పూజలు జరుగుతుండగా, కేరళకే చెందిన 21 మంది పూజారులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్‌తో పాటు అట్లూరి మధు, టీ.వీ.పుల్లంరాజు, సరిపుడి నాగేశ్వరరావు, మహేశ్వరం శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల తమ పాఠశాలలో నిర్వహించిన చెస్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించాక మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై అవగాహన కల్పిస్తూ పోటీల్లో ప్రతిభ కనబర్చేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.

గెలుపునకు సహకరించడంపై కృతజ్ఞతలు

నేలకొండపల్లి: ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించినందుకు మంగళవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి సంఘం బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్‌టీయూ వివిధ సమస్యలపై పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించడంతోనే ఈ విజయం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.వి.రంగారావు, రత్నకుమార్, శేఖర్, శ్రీనివాసరావు, సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



సరుకులు అందిస్తున్న నాగరాజు, తదితరులు

కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రంలో రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు స్థానిక వజ్ర ఆస్పత్రి నిర్వాహకుడు ఇంటూరి నాగరాజు చౌదరి ఆధ్వర్యాన రంజాన్ తోఫా (సరుకులు) మంగళవారం పలువురి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కఠోర దీక్షలు చేస్తూ దైవ చింతనతో గడుపుతున్న పేద ముస్లింకు తమ వంతు సాయంగా తోఫా అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, మధుతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
వినోద	ఛావా
సాయిరాం	రాక్షస
ఆదిత్య	కింగ్‌స్టన్
శ్రీనివాస	శబ్దం

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	38		20
బెండకాయ	54	పాలకూర	4
పచ్చిమిర్చి	34		20
కాకర	48	చుక్కకూర	4
బోడ కాకర	110		20
బీర	54	తోటకూర	4
దొండ	54		20
పొట్లకాయ	38	గోంగూర	3
చిక్కుడు	90		20
గోరుచిక్కుడు	54	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		25
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	28		20
క్యాప్సికం	48	-ఖమ్మం వ్యవసాయం	

ఆమెకు ఆదరువుగా..

అతివలకు ఆదాయం పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఆయా విభాగాలకు రుణాలు మంజూరు చేస్తూ ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యాన మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సులను అందజేయనుంది. ఇందులో పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల సమాఖ్యలకు బస్సులు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దాదాపు రూ.36 లక్షలు వెచ్చించి బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థకు అప్పగించనున్నారు. అయితే మండలాల సమాఖ్యలకు ఆర్టీసీ ప్రతి నెలా రూ.77,220 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఐదేళ్ల పాటు సమాఖ్యల అప్పులు తీరడంతో పాటు బస్సులు వారి సొంతం కానున్నాయి. – నేలకొండపల్లి



మహిళ సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ఐకేపీ అధికారులు(ఫైల్)

అతివల చేతికి ప్రగతి రథచక్రాలు

- పాలేరులో నాలుగు సమాఖ్యలకు బస్సులు
- రూ.36 లక్షలతో కొనుగోలుకు చర్యలు
- సమాఖ్యలకు ప్రతి నెలా రూ.77,220 అద్దె చెల్లించనున్న ఆర్టీసీ

తీరనున్న సమస్య..

మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సులో రద్దీ పెరగడంతో పురుష ప్రయాణికులకు సీట్లు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల రద్దీ దృష్ట్యా డ్రైవర్లు బస్సులను ఆపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదాయం రావడం లేదనే సాకుతో బస్సుల సంఖ్య తగ్గించారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చేరువలో ఉన్న ఖమ్మం రూరల్ మండలాల్లో చాలా వరకు సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇక తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో చాలా వరకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యాన మహిళా సమాఖ్యలు బస్సుల కొనుగోలుతో సమస్య తీరనుంది. సింహభాగం పల్లె వెలుగు బస్సులు వచ్చే అవకాశం ఉంది.

బస్సులు వెళ్లని గ్రామాలు..

పాలేరు నియోజకవర్గంలో అనేక గ్రామాలకు నేటికి బస్సు సౌకర్యం లేదు. నేలకొండపల్లి మండలంలోని సదాశివాపురం, అనాసాగారం, ముజ్జుగూడెం, ఆచార్లగూడెం, ఆరెగూడెం, కోనాయిగూడెం తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. అదే విధంగా ఖమ్మం రూరల్ మండలం కొండాపురం, పొలిశెట్టిగూడెం, మద్దివారిగూడెం, గుదిమళ్ల తదితర గ్రామాలు, కూసుమంచి మండలంలో చాలా గ్రామాల వరకు మొక్కుబడిగా ఒక్క పూట వెళ్తున్నాయి. తిరుమలాయపాలెం మండలంలో అదే పరిస్థితి ఉండడంతో ఆయా గ్రామస్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

మరింత బలోపేతం..



మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సులు కేటాయించడం చాలా సంతోషం. దీని వలన సంఘాలు మరింత బలోపేతం అవుతాయి. సభ్యులు కోరుకున్న గమ్యం చేరుకునేందుకు ప్రభుత్వం నమ్మకం కలిగిస్తుంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– బి.శ్రీలత, మథర్ థెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు, నేలకొండపల్లి

అనేక అవకాశాలు కల్పిస్తున్నాం..



మహిళల ఆర్థిక బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెడుతుంది. క్యాంటీన్లు, పెరటి కోళ్ల పెంపకం, మీసేవా కేంద్రాలు ఇలా అనేక కార్యక్రమాల ద్వారా ఆర్థిక చేయుతనిస్తుంది. ప్రభుత్వం లక్ష్యం నెరవేర్చేందుకు ఐకేపీ ముందుకు సాగుతుంది.

– పెద్దపాక వెంకటేశ్వర్లు, సీసీ, ఐకేపీ, నేలకొండపల్లి

అన్ని గ్రామాలకు సర్వీస్‌లు ఉండాలి



కొత్తగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో వచ్చే బస్సులు మారుమూల గ్రామాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. దీంతో బస్సుల సమస్య తీర్చినట్లుగా ఉండడంతో పాటు వారికి ఆదాయం మార్గంగా ఉంటుంది. అధికారులు, సంఘాల ప్రతినిధులు అర్థం చేసుకోవాలి.

– డి.రాధాకృష్ణమూర్తి, మంగాపురంతండా

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయండి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పించిన రాయితీ అందేలా అధికారులు, సిబ్బంది ఫీజు చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. మంగళవారం నగరంలోని పలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్‌లను సందర్శించి దరఖాస్తుదారుల అనుమానాలను నివృత్తి చేసే విధానాన్ని పర్యవేక్షించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు ఫీజు చెల్లింపునకు .... వెబ్‌సైట్‌లో సిటిజన్ లాగిన్ అయి ప్రక్రియను కొనసాగించవచ్చన్నారు. ప్రతీ హెల్ప్ డెస్క్ సెంటర్ వద్ద ఒక అధికారి ఉంటుండగా.. నగరంలోని బుర్హాన్‌పురం ఆంజనేయస్వామి గుడి వద్ద, కమాన్‌బజార్ షాదీ ఖానా వద్ద, గాంధీపార్క్, మామిళ్లగూడెం, శ్రీనివాసనగర్ అయ్యప్ప స్వామి గుడి వద్ద, సంభానినగర్, కొలిపాక ఫంక్షన్‌హాల్, ఇందిరానగర్, వీడీవోస్ కాలనీ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, గొల్లగూడెం ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశామన్నారు. కమిషనర్ వెంట ఏసీపీ వసుంధర ఉన్నారు. ఇక కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల వద్ద ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులతో కార్యాలయ ఆవరణ సందడి వాతావరణం నెలకొంది.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన నిల్..



తహసీల్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

నేలకొండపల్లి: ఎల్‌ఆర్‌ఎస్‌కు ప్రభుత్వం ప్రకటించిన రాయితీని మండలంలో స్పందన కనిపించడం లేదు. మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, కొత్తకొత్తూరు గ్రామాల పరిధిలో దాదాపు 1300 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారికి స్థానిక తహసీల్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా ఫోన్ చేసిన పట్టించుకోవడం లేదు. కారణం ఆయా స్థలాలను చాలా వరకు విక్రయించడమే. కనీసం కొనుగోలు చేసిన వారైనా దరఖాస్తు కూడా చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈనెలాఖరు కల్లా ప్రభుత్వ రాయితీని వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.మానిక్‌రావ్ సూచించారు.

కేఎంసీ సమాచారం..

● హెల్ప్ డెస్క్ ఏర్పాటు..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల కోసం మరో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది ప్రజలు ఏ సమస్యతో వచ్చారో తెలుసుకొని, దరఖాస్తు రాయించి ఇన్‌వార్డ్‌లో ఇచ్చేలా చూడనున్నారు. నేరుగా అధికారుల వద్దకు, విభాగాల్లోకి ప్రజలు వెళ్లకుండా హెల్ప్ డెస్క్ వద్దనే పూర్తి సమాచారం తెలపనున్నారు. ప్రజలు ఇచ్చే దరఖాస్తులు ఇన్‌వార్డ్ నుంచి వెంటనే ఆయా విభాగాలకు పంపించి, వెంటనే పరిష్కారం చేసే సమస్య అయితే అక్కడికక్కడే అధికారులు పరిశీలించి పరిష్కరించనున్నారు. ఇక అధికారులను కలిసేందుకు వచ్చిన వారి వివరాలను ఈ హెల్ప్ డెస్క్ వద్ద నమోదు చేసుకొని విజిటర్ స్లిప్‌లు అందజేయనున్నారు.

● బిల్ కలెక్టర్లకు షోకాజ్ నోటీసులు..

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా ఉన్న బిల్ కలెక్టర్లకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఐదుగురు బిల్ కలెక్టర్లు పన్నుల వసూళ్లల్లో వెనుకబడిపోయారని అధికారులు గుర్తించారు. ఎం.నాగరాజు, ఎం.వీరబాబు, వై.సాయి రాంకృష్ణ, బి.వస్త్రం, కె.ఉప్పలిలకు ఈ నోటీసులను అందజేశారు. పన్నుల వసూళ్లల్లో జాప్యం చేస్తే సహించేది లేదని కమిషనర్ హెచ్చరించారు.

● ఆస్పత్రికి జరిమానా..

నగరంలోని 42వ డివిజన్‌లో గల ఓ ఆస్పత్రి నిర్వాహకులు తమ ఆస్పత్రిలోని మెడికల్ వేస్ట్‌ను వెనుక ఖాళీ స్థలంలో వేయడంతో కేఎంసీ అధికారులు రూ.8 వేల జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● కమిషనర్ జన్మదిన వేడుకలు..

ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, పలువురు కార్పొరేటర్లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

రద్దు చేసే వరకూ పోరాటం



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

రఘునాథపాలెం: వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు తెలిపారు. మంగళవారం మండలపరిధిలోని వి.వెంకటాయపాలెంలో జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో 50 శాతానికి పైగా ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. గతంలో ఢిల్లీలో రైతులు ఆందోళన చేపట్టినప్పుడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని చేయలేదని విమర్శించారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి క్వింటాకు రూ. 25వేలు కొనుగోలు చేయాలని, ధరణి పోర్టల్ సమస్యను పరిష్కరించి అర్హులైన వారికి పాస్‌పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై సంఘం తరపున పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ మహాసభలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్, మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ రవి, బాగం ప్రసాద్, భూక్యా జామ్లా, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.

స్మారక స్తూపం కూల్చివేతపై నలుగురిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని ఎంవెంకటాయపాలెంలో గత 30 ఏళ్ల క్రితం గంగవరపు కొండయ్య, పాసంగుల వెంకయ్య స్మారకార్థం నిర్మించిన బస్ షెల్టర్‌ను అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కూల్చారనే ఫిర్యాదుపై రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం ప్రకారం.. సీపీఎంకు చెందిన రెంటాల నాగేశ్వరరావు, కొట్టె రామయ్య, రమేష్, పాపిట్ల శ్రీను మరికొందరు కలిసి రాజకీయ కుట్రతో బస్ షెల్టర్‌ను డ్రిల్లింగ్ మిషన్‌తో కూల్చేందుకు ప్రయత్నించి, షెల్టర్ గోడను కూల్చి వేశారు. అడ్డుకోబోయిన సీపీఐకి చెందిన కార్యకర్తలపై దాడి చేశారు. పాసంగుల. చందర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముష్క రాజు తెలిపారు. ఇదిలా ఉండగా ఈసంఘటనకు సీపీఎంకి ఎలాంటి సంబంధంలేదని సీపీఎం మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, నంద్ర ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

'అన్నం'లో పెళ్లి భోజనం



ఆశ్రమంలో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్రమంలో ఖమ్మంకు చెందిన కడవెండి వేణుగోపాల్ కుమారుడు కడవెండి శ్రీ చక్రధర్, హాసికల వివాహ మహోత్సవం సందర్భంగా మంగళవారం అన్నదానం చేశారు. ఆశ్రమంలోని అనాథలకు మూడు పూటలకు సరిపడా విందు తీసుకొచ్చి వడ్డించినట్లు దంపతుల కుటుంబీకులు తెలిపారు. అన్నం శ్రీనివాసరావు, శబరి, సామాజికవేత్త కడవెండి వేణుగోపాల్, అరుణకుమారి, నూనె శశికుమార్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి



దీక్షలో మాట్లాడుతున్న మాదాసు వెంకన్న

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన రిలే నిరసన దీక్ష చేపట్టారు. మండల కేంద్రంలో చేపట్టిన ఈదీక్షను మండల అధ్యక్షుడు మాదాసు వెంకన్న ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రభుత్వం చట్టబద్ధత కల్పించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, పొట్టపింజర బాలస్వామి, తోళ్ల సురేష్, వెంకన్న వడ్లమూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఆందోళనలో భాగంగా యూఎఫ్‌బీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సాయంత్రం జాతీయ బ్యాంకుల ఉద్యోగులు నగరంలోని వైరారోడ్‌లో ఉన్న ఎస్‌బీఐ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారానికి ఐదు రోజులు పని దినాలు, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, గ్రాట్యూటీ రూ.25 లక్షల వరకు పెంపు వంటి డిమాండ్ల సాధన కోసం ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకుల ఉద్యోగుల ప్రతినిధులు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి ఈ నెల 24, 25 తేదీల్లో దేశ వ్యాప్తంగా సమ్మెకు యూనియన్ పిలుపునిచ్చిందని, ఈ సమ్మెలో బ్యాంకుల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ షేక్ ఇబ్రహీం, రీజనల్ సెక్రటరీ ఆర్.శివకుమార్, ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ సందన్, రీజనల్ సెక్రటరీ చిన్నప్ప రెడ్డి, నేషనల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అటెండర్ పోస్టుకు ఇంటర్వ్యూలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని పార్థీవ వాహనంలో అటెండర్‌గా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ అధికారి భూమా నాగేందర్ తెలిపారు. ఏడో తరగతి పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులని, ఈనెల 13న ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, బ్యాంక్ పాస్ పుస్తకంతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, వివరాలకు 91549 18117 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'లిఫ్ట్' పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, ఈఈలు

రఘునాథపాలెం: మండలంలో సాగు నీరు అందించేందుకు రూ.66 కోట్లతో తలపెట్టిన మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను మంగళవారం జలవనరుల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు పరిశీలించారు. వీవీపాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వపై కొనసాగుతున్న పంప్‌హౌస్ నిర్మాణంతో పాటు గ్రామాల్లో సాగుతున్న పైపులైన్ పనులను సీఈ పరిశీలించి పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. ఉగాది నాటికి సాగుకు లిఫ్ట్ ద్వారా నీరందేలా పనులు కొనసాగించాలని ఆదేశించారు. ఈఈ అనన్య, డీఈ రూన్సీ, ఏఈ ఉన్నారు.

సమస్యలపై ఉద్యమించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో ప్రకటించిన 16 కార్పొరేషన్లలో ముస్లింలను మినహాయించడం విస్మయం కలిగించిందని పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్, తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ షేక్ అబ్దుల్ రహమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం సమాజానికి నాయకత్వం వహిస్తున్న మైనారిటీ నాయకులు పార్టీల జెండాలు పక్కనబెట్టి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని హామీని ఇవ్వకపోగా.. గతంలో బీసీ–బీలకు ఇచ్చిన జీఓ నేటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ముస్లింల ఐక్య కార్యాచరణ ఉద్యమించనున్నట్లు తెలిపారు.

రూ.11.80 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం నుంచి లింక్ రోడ్డుకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.11.80 కోట్ల నిధులు మంత్రి శ్రీనివాసరెడ్డి మంజూరు చేసినట్లు అమ్మగూడెం మాజీ సర్పంచ్ గండు జానయ్య, కాంగ్రెస్ నాయకుడు అడపాల రామారావు తెలిపారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అమ్మగూడెం నుంచి వెళ్లే కోనాయిగూడెం, ఆరెగూడెం, కట్టుకూరు గ్రామాలను కలిపే లింకు రోడ్డుకు నిధులు కేటాయించిన మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలోనే తలసేమియా చిన్నారులకు 'సదరం'



మహిళలను సత్కరిస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా, సికెల్‌సెల్ చిన్నారులకు ఏళ్లుగా ఆగిపోయిన సదరం సర్టిఫికెట్ జిల్లా కలెక్టర్ చొరవతో త్వరలోనే జారీ కానుందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం వద్ద తలసేమియా చిన్నారులకు ఉచిత మందులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగిల్ పేరెంట్‌గా ఉండి చిన్నారులను కాపాడుకుంటున్న మహిళలను ఘనంగా సత్కరించాక సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సదరం సర్టిఫికెట్ చిన్నారుల కుటుంబాలకు ఓ వరం లాంటిదని, దీంతో వారిపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు సదరం సర్టిఫికెట్ల కోసం చిన్నారులతో దరఖాస్తులు చేయించాలని సూచించారు.అనంతరం తలసేమియా చిన్నారులను కాపాడుతున్న మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణమూర్తి, జాబిశెట్టి రేణుక, లక్ష్మీదీపా, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యాక్షేత్ర స్కూల్ కరస్పాండెంట్ భాగ్య, అనురాధ, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి పావని, ప్రొద్దుటూరి రవిచందర్, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణకు చట్టం అయ్యే వరకూ ఎటువంటి ఉద్యోగ నియామకాలు భర్తీ చేయొద్దని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం అర్బన్ తహసీల్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షను ఖమ్మం జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్ బాజీబాబా ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు బచ్చలకూర వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు తూరుగంటి అంజయ్య, సునిల్, రాము, శ్రీను, సూర్యపల్లి నాగేశ్వరరావు, బలంతు యేసు, తగరం వెంకన్న, సూరేపల్లి వెంకటరత్నం, గంట భీమయ్య, చిలుముల వెంకట్, పి.వెంకట్, షేక్ బాబు, శ్రీను, పాల్గొన్నారు.

దేవాదాయశాఖ పరిధిలోకి బాలగణపతి ఆలయం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఇందిరానగర్ జంక్షన్‌లోని శ్రీబాలగణపతి ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు. అయితే, భక్తుల రద్దీ పెరుగుతుండడంతో కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, రెండు రోజుల క్రితం దేవాదాయ శాఖ ఈఓ వెంకటేశ్వర్లు ఆలయ వివరాలు సేకరించారు. ఈక్రమంలో హుండీకి సీల్ వేయగా, చైర్మన్ వీరయ్య సమక్షాన తెరిచేందుకు మంగళవారం రాగా ఆయన అందుబాటులో లేకపోవడంతో వాయిదా పడింది.

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి నిర్వీర్యం



సదస్సులో మాట్లాడుతున్న అజాద్

ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నూతన ముసాయిదా దేశ సమైక్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా, భారత రాజ్యాంగం ఉమ్మడి జాబితాలోని విద్యారంగం పట్ల రాష్ట్రాలకు కల్పించిన హక్కులను కాలరాయడమేనని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు అజాద్, తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ విమర్శించారు. మంగళవారం యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ కేయూ సబ్ క్యాంపస్‌లో లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా విద్యారంగంలో దేశ వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక సంస్కరణలకు పూనుకుంటున్నదన్నారు. రాష్ట్రాల సమైక్యత స్ఫూర్తిని దెబ్బతీసేలా యూజీసీ డ్రాఫ్ట్ 2025 ఉందని, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నల్లో విద్యా కాషాయీకరణే ధ్యేయంగా, దేశ లౌకిక వ్యవస్థ విచ్ఛిన్నమే లక్ష్యంగా దేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసే కుట్రపూరిత చర్యలకు ఒడిగడుతున్నదన్నారు. ఈ సదస్సులో జిల్లా నాయకులు సందీప్, నసీర్, భారత్, ప్రియాంక, అఖిల, సింధు తదితరులు పాల్గొన్నారు.